www.aksharadarbar.com
సోమవారం 01, జూలై 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :127 | పేజీలు : 04 | వెల : 05

త్వరలో కేబినెట్ విస్తరణ..

- సీతక్కకు హోంమంత్రి పదవి..
- మంత్రి దామోదర రాజనర్సింహ కీలక వ్యాఖ్యలు

02

గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ..

పలు కీలక అంశాలపై చర్చ..!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం రాజ్ భవన్ లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ను కలిశారు. త్వరలో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందనే ప్రచారం నేపథ్యంలో.. గవర్నర్ తో రేవంత్ రెడ్డి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. కేబినెట్ విస్తరణ, ఎమ్మెల్సీల నియామకం, పెండింగ్ బిల్లులపై ఆయనతో చర్చించినట్లు సమాచారం. త్వరలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో ఆ అంశంపై చర్చించినట్లు తెలుస్తోంది. అంతేగాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రభుత్వ ఆస్తుల పంపిణీ విషయమై కూడా సీఎం గవర్నర్ తో చర్చించినట్లు కూడా ఊహాగానాలు వస్తున్నాయి.

-అక్షర దర్బార్, హైదరాబాద్

03

- రోజు రోజుకూ పెరుగుతున్న గంజాయి అమ్మకాలు
- గంజాయి మత్తు బాట పడుతున్న యువత
- గ్యాంగ్ లుగా ఏర్పడి పరస్పర దాడులు
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న కొందరు పోలీస్ అధికారులు
- వరుస ఘటనలతో జనం విస్మయం

కాటారంలో రౌడీ కల్చర్!

శాంతి భద్రతలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. ఈ నేపథ్యంలో చిత్తశుద్ధితో పనిచేసే అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ప్రకటించింది. లా అండ్ ఆర్డర్ అమల్లో తాము ఎక్కడా కలగజేసుకోబోమని ప్రభుత్వంలోని పెద్దలు సైతం స్పష్టం చేశారు. ప్రధానంగా యువత జీవితాలను చిత్తు చేస్తున్న గంజాయి, డ్రగ్స్, మాఫియాలపై ఉక్కు పాదం మోపాలని పోలీస్ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. గంజాయి రవాణా, అమ్మకాలు, సేవించటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని పలు సందర్భాల్లో చెప్పారు. ఇదే సమయంలో రౌడీయిజం, గూండాయిజాన్ని కూకటివేళ్లతో పైకిలించాలని సూచించారు. అయితే పోలీసు శాఖలోని కొందరు పోలీస్ అధికారులు అధికారులు మాత్రం తాము మారేదే లేదు అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. గంజాయి రవాణా, అమ్మకాలను అరికట్టడంతో పాటు యువత గంజాయి బారిన పడకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారులు కొందరు అందుకు భిన్నంగా నడుచుకుంటున్నారు. ఫలితంగా ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో కూడా రౌడీ కల్చర్ పురుడు పోసుకుంటుంది. ప్రస్తుతం ఇటీవలి కాలంగా కొందరు పోలీసుల తీరుతో రాష్ట్రంలోనే చర్చనీయమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారంలో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు కనబడుతుంది. రౌడీ కల్చర్ కు కాటారం కేరాఫ్ గా మారుతున్నట్లు జరిగిన ఘటనల ద్వారా స్పష్టం అవుతుంది. గంజాయి అమ్మకాలు, సేవించడం వంటివి రోజురోజుకి పెరిగిపోతుండటంతో ఇక్కడ కొత్తగా గ్యాంగ్ లు ఏర్పడి పరస్పరం దాడులకు దిగుతుండటం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. నియంత్రించాల్సిన కొందరు పోలీసు అధికారులు చూసి చూడనట్లు ముందుకు వెళుతుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- అక్షర దర్బార్, భూపాలపల్లి

02

ములుగు జిల్లా ఇక సమ్మక్క - సారలమ్మ జిల్లా

ములుగు జిల్లా ఇక సమ్మక్కసారలమ్మ జిల్లాగా మారనుంది. జిల్లా పేరు మార్పుపై ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతులు వచ్చినట్లు కలెక్టర్ దివాకర వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా పేరు ఇక సమ్మక్క సారలమ్మ జిల్లాగా మారుతున్నట్లు ఆయన వెల్లడించారు.

– అక్షర దర్బార్, ములుగు

03

కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

- సారయ్య, బండా ప్రకాశ్‌తో పార్టీ పెద్దల సంప్రదింపులు..
- త్వరలోనే మూకుమ్మడిగా ఎమ్మెల్సీల చేరికలకు ప్లాన్

తెలంగాణలో పదేళ్లపాటు ఏకఛత్రాధిపత్యంగా సాగిన బీఆర్ఎస్ చరిష్మా క్రమంగా తగ్గుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సంఖ్య జీరోకు పడిపోవడంతో ఆ పార్టీ నుంచి నేతలు ఒక్కొరొక్కరుగా జారుకుంటున్నారు. ఇటీవల బీఆర్ఎస్ కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. తాజాగా పలువురు ఎమ్మెల్సీలు సైతం ఇదే దారిలో నడుస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్ హస్తం పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్ లో ఎమ్మెల్సీ సారయ్యతో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి చర్చించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆయనతోపాటు బండా ప్రకాశ్ కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే ఒకేసారి పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను చేర్చుకునేందుకు కాంగ్రెస్ అధినాయకత్వం పావులు కదుపుతున్నట్లు సమాచారం. - అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి

04

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

- రోజు రోజుకి పెరుగుతున్న గంజాయి అమ్మకాలు
- గంజాయి మత్తు బాట పడుతున్న యువత
- గ్యాంగ్ లుగా ఏర్పడి పరస్పర దాడులు
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న కొందరు పోలీస్ అధికారులు
- వరుస ఘటనలతో జనం విస్మయం

కాటారంలో రౌడీ కల్చర్!

అక్షర దర్బార్, భూపాలపల్లి:

శాంతి భద్రతలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. ఈ నేపథ్యంలో చిత్తశుద్ధితో పనిచేసే అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ప్రకటించింది. లా అండ్ ఆర్డర్ అమల్లో తాము ఎక్కడా కలగజేసుకోబోమని ప్రభుత్వంలోని పెద్దలు సైతం స్పష్టం చేశారు. ప్రధానంగా యువత జీవితాలను చిత్తు చేస్తున్న గంజాయి, డ్రగ్స్, మాఫియాలపై ఉక్కు పాదం మోపాలని పోలీస్ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. గంజాయి రవాణా, అమ్మకాలు, సేవించటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని పలు సందర్భాల్లో చెప్పారు. ఇదే సమయంలో రౌడీయిజం, గూండాయిజాన్ని కూకటివేళ్లతో పైకిలించాలని సూచించారు. అయితే పోలీసు శాఖలోని కొందరు పోలీస్ అధికారులు అధికారులు మాత్రం తాము మారేదే లేదు అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. గంజాయి రవాణా, అమ్మకాలను అరికట్టడంతో పాటు యువత గంజాయి బారిన పడకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారులు కొందరు అందుకు భిన్నంగా నడుచుకుంటున్నారు. ఫలితంగా ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో కూడా రౌడీ కల్చర్ పురుడు పోసుకుంటుంది. ప్రస్తుతం ఇటీవలి కాలంగా కొందరు పోలీసుల తీరుతో రాష్ట్రంలోనే చర్చనీయమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారంలో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు కనబడుతుంది. రౌడీ కల్చర్ కు కాటారం కేరాఫ్ గా మారుతున్నట్లు జరిగిన ఘటనల ద్వారా స్పష్టం అవుతుంది. గంజాయి అమ్మకాలు, సేవించడం వంటివి రోజురోజుకి పెరిగిపోతుండటంతో ఇక్కడ కొత్తగా గ్యాంగ్ లు ఏర్పడి పరస్పరం దాడులకు దిగుతుండటం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. నియంత్రించాల్సిన కొందరు పోలీసు అధికారులు చూసి చూడనట్లు ముందుకు వెళుతుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- గ్యాంగ్ వార్!

కాటారం కోల్ బెల్ట్ ప్రాంతాల మధ్యలో ఉంది. ఒకవైపున పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని, మరోవైపు జిల్లా కేంద్రమైన భూపాలపల్లి కోల్ బెల్ట్ ప్రాంతం. కోల్ బెల్ట్ ప్రాంతాల్లో క్రైమ్ కొంత ఎక్కువగా ఉంటుంది అనేది ప్రచారంలో ఉంది. వెరసి ఈ ప్రాంతాల్లో రౌడీ కల్చర్ కొనసాగుతున్నట్లు స్థానికులు చెప్పుకుంటారు. ఈ రెండు కోల్ బెల్టు ప్రాంతాల మధ్యన ఉన్న ఇన్నాళ్లు ప్రశాంత వాతావరణం కొనసాగింది. ఇటీవల కాలంగా రౌడీ కల్చర్ కోల్ బెల్ట్ ప్రాంతాల నుంచి కాటారం ప్రాంతానికి విస్తరించినట్లు కనపడుతుంది. గంజాయి అమ్మకాలు, సేవించడం వంటివి పెరిగిపోతుండటమే ఇందుకు కారణమని స్థానికులు భావిస్తున్నారు. గంజాయికి అలవాటు పడి మత్తుతో జీవితాలను చిత్తు చేసుకుంటున్న యువత గ్యాంగ్ లుగా ఏర్పడి గొడవలకు దిగుతున్నట్లు ఇటీవల జరిగిన సంఘటనల ద్వారా తెలుస్తోంది. ఇరవై రోజుల క్రితం రెండు వర్గాల మధ్య ఇక్కడ కత్తులతో పరస్పర దాడులు జరిగాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు పోలీసులు ఎవరిని కూడా అరెస్ట్ చేసిన దాఖలాలు లేవు. ఇలాంటి ఘటనలకు తోడు ఇటీవల కాటారంలో పొరుగున ఉన్న మహాదేవపూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తిపై గ్యాంగ్ దాడి జరిగింది. ఈ దాడిలో మహాదేవపూర్ మండలానికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో కూడా ఈ దాడి ఘటన నమోదైనట్లు సమాచారం. ఈ కేసులో కూడా స్థానిక పోలీసులు ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయకపోవడం విమర్శలకు మరింత బలం చేకూరింది. పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటం వల్ల మాఫియాను ఇక్కడ పెంచి పోషించినట్లే అవుతుందని స్థానికంగా చర్చ తెరపైకి వచ్చింది. కోల్ బెల్ట్ ప్రాంతాల మాదిరిగా కాటారంలో కూడా రౌడీ కల్చర్ వచ్చినట్లేననే ప్రచారం రోజు రోజుకి బలపడిపోతుంది. జరిగిన ఘటనలను మీడియాలో రాకుండా చూసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్న కొందరు పోలీసు అధికారులు శాంతిభద్రతల నిర్వహణపై దృష్టి సారిస్తే ఇక్కడ తిరిగి ప్రశాంత వాతావరణం ఆవిష్కృతం కాగలదనే భావన స్థానికుల్లో వినబడుతుంది. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి కాటారంలో రౌడీ కల్చర్ కు తెర వేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.



త్వరలో కేబినెట్ విస్తరణ..

- సీతక్కకు హోంమంత్రి పదవి..

- మంత్రి దామోదర రాజనర్సింహ కీలక వ్యాఖ్యలు

అక్షర దర్బార్, హైదరాబాద్ : తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనర్సింహ మాట్లాడుతూ... త్వరలోనే కేబినెట్ విస్తరణ ఉంటుందని తెలిపారు. ఇప్పుడున్న పలువురి శాఖలు సైతం మారే అవకాశాలు ఉన్నాయన్నారు. సీతక్కకు హోంమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దానం నాగేందర్, నిజామాబాద్ నుంచి ఒకరికి మంత్రివర్గంలో స్థానం లభించే అవకాశం ఉందన్నారు. రాజకీయాలు పరిస్థితులను బట్టి మారుతుంటాయన్నారు. 2018 ఎన్నిలకు ముందు ప్యారాషూట్లకు టికెట్లు లేవని రాహుల్ గాంధీ చెప్పారని.. కానీ పరిస్థితుల దృష్ట్యా టికెట్ల కేటాయింపు జరిగిందన్నారు. త్వరలో వైద్యశాఖలో ప్రక్షాళన, సంస్కరణలు తీసుకువస్తామన్నారు. వైద్యశాఖలో రెండే విభాగాలు ఉండాలన్నారు. ఇందులో ఒకటి అడ్మినిస్ట్రేషన్, రెండు ఎడ్యుకేషన్ గా ఉంటుందని దామోదర తెలిపారు.

నేడు 'రైతు బంధు' విధి విధానాలపై సర్వసభ్య సమావేశం

అక్షర దర్బార్,మహాదేవపూర్ : నేడు మహాదేవపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుబంధు విధి విధానాలపై సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాజబాబు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్లా తిరుపతయ్య ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో మహాదేవపూర్, పలిమెల మండలాల్లోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహాదేవపూర్‌లో ప్రజావాణి

అక్షర దర్బార్, మహాదేవపూర్ : సోమవారం మహాదేవపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సంబంధిత సమస్యల అప్లికేషన్లు 51 వచ్చాయని తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ తెలిపారు. మండల రెవెన్యూ పరిధిలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు వారి యొక్క భూ సమస్యలపై అప్లికేషన్లు ఇచ్చారని వాటిని వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ వివరించారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్

సీనరేజీ నిధులు జీపీలకు కేటాయించాలి

ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహా మూర్తి

అక్షర దర్బార్, మంగపేట: ఏజెన్సీ ప్రాంతం నుండి ఇసుక ద్వారా ప్రతినెలా 460 కోట్ల రూపాయలు, ఏడాదికి మూడు వేల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి వెళ్తున్నా ప్రభావిత ఏజెన్సీ ప్రాంతాలకు ఎటువంటి ప్రయోజనం లేదని, ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆరోపించారు. సోమవారం నర్సింహామూర్తి ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ ను, గ్రీవెన్స్ లో కలిసి పలు సమస్యల పైన వినతిపత్రం అందజేశారు. ఆయా వివరాలను సోమవారం మీడియాకు విడుదల చేశారు. గతంలో ఇసుక నిర్వహణ ద్వారా వచ్చే ముప్పై శాతం సీనరేజి ప్రభావిత గ్రామపంచాయతీలకు వచ్చేదని, తద్వారా ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి జరిగేదని కలెక్టర్ కి ఆయన వివరించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ట్రస్ట్ ఫండ్ లో కలపడం కారణంగా, ఇసుక ద్వారా వచ్చిన సీనరేజి నిధులను జిల్లా మొత్తం కేటాయించడం సరికాదని తెలిపారు. మల్లూరు రాజుపేట, కత్తిగూడెం ఇసుక రిచుల్లో రేజింగ్ కాంట్రాక్టర్ ల ఆగడాలకు హద్దులు లేకుండా పోతున్నాయని, ఆ ఇసుక క్వారీలను తక్షణమే నిలుపుదల చేయాలని కలెక్టర్ ను కోరారు. దీని పైన కలెక్టర్ దివాకర్ వెంటనే స్పందించి తక్షణమే క్వారీలను నిలుపుదల చేసి ,విచారణ చేపట్టాలని టిఎస్ఎండిసి పి.ఓ. శ్రీరాములు ని ఆదేశించారు. అన్ని విషయాల పైన సానుకూలంగా స్పందించిన కలెక్టర్ దివాకర్ అన్ని సమస్యలు పరిష్కరిస్తా మని హామీ ఇచ్చారు. త్వరలోనే ఏజెన్సీ గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటా అని అన్నారు. ఎల్ .టి .ఆర్ కేసులు అన్ని జడ్జిమెంట్ లు వచ్చేలా చర్యలు చేపడతాను అని, ఎల్ టి ఆర్ పెండింగ్ కేసుల వివరాలు అన్ని అందుబాటులో ఉంచాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు

కలెక్టర్ కు వినతిపత్రం ఇస్తున్న నర్సింహామూర్తి

కేసీఆర్ కు బిగ్ షాక్

- విద్యుత్ కమిషన్‌పై వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు
- ప్రభుత్వ వాదనలను సమర్థించిన ద్విసభ్య ధర్మాసనం
- విచారణ కొనసాగించొచ్చని స్పష్టతనిచ్చిన న్యాయస్థానం
- నర్సింహారెడ్డి కమిషన్‌కు న్యాయమూర్తి గ్రీన్ సిగ్నల్
- గులాబీ బాస్ భవిష్యత్ వ్యూహంపై ఉత్కంఠ

అక్షర దర్బార్, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలంటూ కేసీఆర్ పెట్టుకున్న రిట్ పిటిషన్‌ను న్యాయస్థానం సోమవారం కొట్టివేసింది. గత ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోళ్ల అంశంపై ఏర్పాటు చేసిన జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ ను రద్దుచేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్ కమిషన్ ఏకపక్షంగా వ్యవహ రిస్తోందంటూ కేసీఆర్ తన పిటీషన్ లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ పై హైకోర్టు విచారణ జరిపింది. ఇటీవల ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించగా.. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ ఆధిత్య వాదనలు వినిపించారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే కేసీఆర్ పిటీషన్ ను డిస్మిస్ చేశారు. విద్యుత్ కమిషన్ విచారణను కొనసాగించ వచ్చు అంటూ పేర్కొన్నారు.

మరోమారు నోటీసులు..

గత ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై విచారించేందుకు జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటైన విషయం తెలిసిందే. కమిషన్ ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చి విచారణ చేసింది. గత ప్రభుత్వంలో సీఎండీగా ఉన్న ప్రభాకర్ రావుకు సైతం నోటీసులు ఇచ్చి విచారించింది. అతని స్టేట్ మెంట్ ను కమిషన్ సభ్యులు రికార్డు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కు కూడా కమిషన్ రెండుసార్లు నోటీసులు ఇచ్చింది. ఆ రెండు సార్లు కేసీఆర్ విచార ణకు హాజరుకాలేదు. దీనికితోడు నర్సింహారెడ్డి కమిషన్ ను రద్దు చేయాలని కోరుతూ కేసీఆర్ హైకోర్టుకు వెళ్లారు. నర్సింహారావు కమిషన్ ఏకపక్షంగా వ్యవహరి స్తోందంటూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయగా.. ప్రస్తుతం ఆ పిటీషన్ ను కోర్టు కొట్టివేసింది. తాజా కోర్టు తీర్పుతో మరోసారి కేసీఆర్ కు నోటీసులు ఇచ్చి విచా రించాలని కమిషన్ భావిస్తోంది. రేపు, లేదా ఎల్లుండి మరోసారి కేసీఆర్ కు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఏ తేదీన విచారణకు హాజరుకావాలని కమిషన్ నోటీసులు ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్తారా ? లేదా కమిషన్ నోటీసులు ఇస్తే.. వారు సూచించిన తేదీన విచారణకు హాజరవు తారా అనే విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది.

గవర్నర్ తో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ..

- పలు కీలక అంశాలపై చర్చ..!

అక్షర దర్బార్, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిశారు. త్వరలో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందనే ప్రచారం నేపథ్యంలో.. గవర్నర్‌తో రేవంత్‌రెడ్డి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. కేబినెట్ విస్తరణ, ఎమ్మెల్సీల నియామకం, పెండింగ్ బిల్లులపై ఆయనతో చర్చించినట్లు సమాచారం. త్వరలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో ఆ అంశంపై చర్చించినట్లు తెలుస్తోంది. అంతేగాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రభుత్వ ఆస్తుల పంపిణీ విషయమై కూడా సీఎం గవర్నర్ తో చర్చించినట్లు కూడా ఊహాగానాలు వస్తున్నాయి. రేవంత్ రెడ్డి ఇటీవల న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర సీనియర్లను కలిశారు. తెలంగాణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరి ష్కరించాలని కోరుతూ పలువురు కేంద్ర మంత్రులతో కూడా భేటీ అయిన సంగతి తెలిసిందే.

పోలీస్ అధికారులను సన్మానిస్తున్న సీపీ

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, హన్మకొండ: ఉద్యోగ విరమణ అనంతరం పోలీస్ అధికారులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధి కారులను సీపీ ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్సైలు వెంకటేశ్వర్లు, రవి, యాదగిరి, ఏఎస్సైలు సాంబయ్య, ప్రభాకర్ ను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో పనిచేయడమే కాకుండా క్లిష్ట సమయాల్లో విధులు నిర్వహించి నేడు శాంతియుతమైన వాతవరణ కల్పించడంలో ప్రధాన కారకులన్నారు. నేటి తరం పోలీసులకు స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్, ఆర్.ఐలు శ్రీధర్, చంద్రశేకర్, ఆర్ ఎస్ఐ శ్రవణ్ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- బల్దియా కమీషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజల నుండి విజ్ఞప్తుల స్వీకరణ..
- సీఎం పర్యటన విజయవంతంపై ఉద్యోగులకు అభినందనలు

ఫిర్యాదులను స్వీకరిస్తున్న బల్దియా కమిషనర్

అక్షర దర్బార్, వరంగల్: గ్రీవెన్స్ కార్యక్రమంలో స్వీకరిం చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని బల్దియా కమి షనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశిం చారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరిం చుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. హైదరాబాద్ ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీకు సంబంధిం చిన వినతులపై ప్రత్యేక చొరవ చూపి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ... ఇటీవల ముఖ్యమంత్రి నగర పర్యటన విజయవంతం కావడంలో అధికారులు, సిబ్బంది తమవంతు పాత్ర పోషించారని అభినందించారు. ఇంజ నీరింగ్ విభాగంలో 25, హెల్త్& శానిటేషన్ 06, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) 09, టౌన్ ప్లానింగ్ విభాగానికి 41 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు కృష్ణారావు ప్రవీణ్ చంద్ర, సిఎంహెచ్ ఓ డా రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న బయల జిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ ఓ శంకర్ లింగం, టిపిఆర్ ఓ కోలా రాజేష్ కుమార్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి తది తరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ ములుగు జిల్లా

- పేరు మార్చుటకు అభ్యంతరాల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

అక్షర దర్బార్, ములుగు: రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రతిపా దనల మేరకు సమ్మక్క- సారలమ్మ ములుగు జిల్లాగా, జిల్లా పేరు మార్చుటకు అభ్యంతరాల స్వీకరణకు నోటీస్ ను విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పేరును సమ్మక్క-సారలమ్మ ములుగు జిల్లాగా మారుస్తూ పబ్లిక్ నోటీస్ జారీ చేయడం జరిగిం దని, జిల్లా పేరు మార్చడంపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే బుధవారం గ్రామాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే గ్రామ సభల ద్వారా తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలో లిఖిత పూర్వకంగా తెలియ జేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కౌండిన్య పరపతి సంఘం కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా గాజర్ల అశోక్ గౌడ్
- ప్రధాన కార్యదర్శిగా బాలగోని రమేష్ గౌడ్

మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు అశోక్ గౌడ్

అక్షర దర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లాకు చెందిన గీత కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగస్తులతో కూడిన శ్రీకౌండిన్య సహకార పరపతి సంఘాన్ని సోమవారం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని నూతన కమిటీ హాల్ లో సోమవారం 130 మందితో గౌడ పరపతి సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుల పరపతి సంక్షేమం కోసం తీసుకోవాల్సిన విధి విధానాలు చర్చించారు. అనంతరం కమిటీ అధ్యక్షు లుగా గాజర్ల అశోక్ గౌడ్. ఉపాధ్యక్షులుగా పెరుమాండ్ల తిరుపతి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బాలగోని రమేష్ గౌడ్, కోశాధికారిగా ముత్యాల రాజబాబు గౌడ్, ప్రచార కార్యద ర్శిగా మోడం ఉమేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, ముఖ్య సలహాదారులుగా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూనూరు సురేష్ కుమార్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ కంకటి రాజవీర్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా ముంజాల రవీందర్ గౌడ్, శ్రీపతి ప్రభాకర్ గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, తాటి అశోక్ గౌడ్, గద్దం సదానంద గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ గూటికి
బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు!

- సారయ్య, బండా ప్రకాష్ తో పార్టీ పెద్దల సంప్రదింపులు..
- త్వరలోనే మూకుమ్మడిగా ఎమ్మెల్సీల చేరికలకు ప్లాన్

అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి: తెలంగాణలో పదేళ్లపాటు ఏకఛత్రాధిపత్యంగా సాగిన బీఆర్ఎస్ చరిష్మా క్రమంగా తగ్గుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సంఖ్య జీరోకు పడిపోవడంతో ఆ పార్టీ నుంచి నేతలు ఒక్కొరొక్కరుగా జారుకుంటున్నారు. ఇటీవల బీఆర్ఎస్ కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. తాజాగా పలువురు ఎమ్మెల్సీలు సైతం ఇదే దారిలో నడుస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బండా ప్రకాష్ హస్తం పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్ లో ఎమ్మెల్సీ సారయ్యతో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి చర్చించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆయనతోపాటు బండా ప్రకాశ్ కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే ఒకేసారి పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను చేర్చుకునేందుకు కాంగ్రెస్ అధినాయకత్వం పావులు కదుపుతున్నట్లు సమాచారం.

- గత కొంతకాలంగా చర్చలు..

వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కాంగ్రెస్ గూటికి చేరేందుకు ప్రయత్నాలు చేసినట్లు గతంలోనూ వార్తలొచ్చాయి. కాంగ్రెస్ నాయకుడు నూకల నరేషరెడ్డితో కలిసి ఆయన ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరే విషయమై చర్చించారు. ఆయన చేరిక పట్ల మంత్రి తుమ్మల సానుకూలత వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానంతో మాట్లాడి చేర్చుకునే విషయమై సానుకూల నిర్ణయాన్ని తీసుకుంటామని తెలిపారు. పార్టీలో ఎప్పుడు చేరాలనే విషయంపై వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలతో మాట్లాడి చెబుతామని బస్వరాజు సారయ్యకు మంత్రి తుమ్మల వెల్లడించారు. అనంతరం మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డిని కూడా బస్వరాజు సారయ్య కలిసి, పార్టీలో చేరే విషయమై చర్చించినట్లు గతంలో ప్రచారం జరిగింది. ఈక్రమంలోనే సారయ్య తాజాగా కాంగ్రెస్ పెద్దలతో జరిపిన చర్చలు సఫలం అయ్యాయని, నేడో రేపో ఆయన హస్తం గూటికి చేరుకుంటారనే టాక్ బలంగా వినిపిస్తోంది.

సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్సీ ప్రకాష్

మహిళా రైతు
ఆత్మహత్యాయత్నం

- జనగామ కలెక్టరేట్ లో ఘటన
- ఇటీవలే ఓ రైతు ఆత్మహత్యాయత్నం

అక్షర దర్బార్, జనగామ: సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జనగామ కలెక్టరేట్లో ఓ మహిళా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. ఇటీవలే భూ వివాదం నేపథ్యంలో ఓ రైతు పురుగుల మందు తాగి కలెక్టరేట్ భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి ప్రయత్నించాడు. ఆ ఘటన మరవక ముందే తాజాగా జనగామ జిల్లా నర్మెట మండలానికి చెందిన దేవరపల్లి జ్యోతి తన వ్యవ సాయ భూ సమస్య విషయమై ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం ఆందోళన కలిగించింది. వివరాల్లోకి వెళ్తే.. భూ వివాదంలో జ్యోతి కొద్ది రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పట్టించుకోవడంలేదని మనస్థాపం చెంది సోమవారం కలెక్టరేట్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. గమనించిన పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. అయితే అప్పటికే ఇంటివద్ద నిద్ర మాత్రలు మింగి ఇద్దరు పిల్లలతో కలిసి కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి జ్యోతి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం జ్యోతిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాకానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నిరుపేదలకు అదృశ్య శక్తుల
ఆపన్నహస్తం

- నిరుపేదలకు అండగా..
- పిల్లల చదువుకు ఆర్థిక సహకారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న అంబేద్కర్ కాలనీ వాసులు

అక్షర దర్బార్, మంగపేట : మంగపేట మండలం కమలాపురం అంబేద్కర్ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబాలకు గుర్తు తెలియని వ్యక్తులు గత మూడేళ్లుగా ఆర్థిక సాయం అందిస్తూ ఆదుకుంటున్నారు. పేద పిల్లల చదువుకు తమ వంతుగా సహకారం అందిస్తూ వారికి బుక్స్, బ్యాగ్స్, యూనిఫాం అందజేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అంతేకాకుండా వృద్ధులు, దివ్యాంగులు తదితరులకు కూడా ఆర్థిక సాయం చేసినట్లు అంబేద్కర్ కాలనీ వాసులు తెలిపారు దీనిపై స్థానికులు అడగగా.. నిరుపేదలు, పేద విద్యార్థుల చదువు కోసం మా వంతుగా ఆర్థిక సాయం చేస్తున్నామని.. ఇంత చిన్న సాయానికి మా పేర్లు చెప్పే అంత పెద్ద వాళ్లం కాదని వివరించినట్లు స్థానికులు తెలిపారు. కాగా, అంబేద్కర్ కాలనీ వాసులు తదితరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గంగాదేవి బోనాలు

మొక్కులు చెల్లిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అక్షర దర్బార్, మహాదేవపూర్ :మండల కేంద్రంలో గంగాదేవి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. గంగపుత్రులు మండల కేంద్రంలోని గంగాదేవి ఆలయం నుండి పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను లక్ష్మీ దేవరను మంగళ హారతులతో ఊరేగిస్తూ గోదావరి నదిలో స్నానాలు చేయించి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, జెడ్పీటీసీ గుడాల అరుణ, ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి అశోక్ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

మృత్యువాత పడిన శేఖర్

అక్షర దర్బార్,మహాదేవపూర్ : మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారు వద్ద గ్రావిటీ కెనాల్ లో పడి నైతమ్ శేఖర్ అనే వ్యక్తి మృతి చెందాడు. కాళేశ్వరం ఎస్సై చక్రపాణి వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన శేఖర్ ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్కీడ్రా విజేతలకు
బహుమతులు పంపిణీ

అక్షదర్బార్, హన్మకొండ: ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులను అందజేయడానికి సోమవారం హన్మకొండ బస్టాండ్ లో డ్రా తీశారు. హనుమకొండ, ఉప్పల్, హైదరాబాద్ రూట్లలో తిరిగే డీలక్స్ బస్సులకు సంబంధించి ఈ లక్కీ డ్రా కార్యక్రమాన్ని హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ మాధవరావు పాల్గొని డ్రా తీసి విజేతలను ప్రకటించారు. బి.రాణి(ప్రథమ), బికేవి నారాయణమ్మ(ద్వితీయ), కే.శ్వేత(తృతీయ) స్థానంలో నిలిచారు. విజేతలు హనుమకొండ డిపోలో సంప్రదించి బహుమతులను తీసుకెళ్లవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో ట్రాఫిక్ సూపర్ వైజర్ నజియా సుల్తానా, మెకానిక్ సూపర్ వైజర్ వి.చంద్రశేఖర్, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ కేవస్ రావు, కాసం మల్లికార్జున్ పాల్గొన్నారు. బహుమతులను కాసం పుల్లయ్య క్లాత్ స్టోర్స్ సౌజన్యంతో అందజేస్తున్నట్లు డీఎం తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- ఘనంగా వనమహోత్సవం

అక్షర దర్బార్, నర్సంపేట : పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యంతో పాటు వర్షాలు సమృద్ధిగా పడాలంటే మొక్కలు నాటాలన్నారు. నేటి నుండి ప్రారంభమైన వనమోత్సవం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలతో పాటు గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు విరివిగా నాటాలని ఆయన సూచించారు. హరిత నర్సంపేట గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి